

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024 | 5





నేత్రపర్వం... అంతర్వేది నరసన్న రథోత్సవం

వేలాది మంది గోవింద నామస్మరణ మధ్య అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్ రథానికి తొలి పూజ చేసి కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజా వారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధి లోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. గోవింద, నారసింహ నామస్మరణలతో భక్తులు రథాన్ని లాగారు.... 7లో







ఆలమూరు: ఆలమూరులో నవజనార్దన స్వామి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ అర్చకస్వాములు అంగర రంగాచార్యులు, సూర్యభగవాన్, పలువురు వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీభూ సమేత జనార్దన స్వామిని ప్రత్యేక పూజల అనంతరం రథంపై ఆశీనులు గావించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఆలయం వద్ద నుంచి జొన్నాడ ఎస్-టర్నింగ్ వరకు రథోత్సవం కోలాహలంగా సాగింది. నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఏఎస్‌ఐ ఎ.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

మండపేట: పట్టణంలోని అగస్త్యేశ్వర జనార్దన స్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రథోత్సవ ఊరేగింపును మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైసీపీ యువ నేత తోట పృధ్వీరాజ్ ప్రారంభించగా కలువపువ్వు సెంటరు వరకు సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కమనీయం... ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. మూలవిరాట్టు భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్ర పాలకులకుడు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామి, శ్రీచండికా సమేత సూరేశ్వరస్వామికి ఏకకాలంలో జరిగిన కల్యాణ మహోత్సవం భక్తులు తన్మయత్వంతో తిలకించారు. .. 7లో



ఇసుక, మట్టి తవ్వకాలపై అధికారులను నిలదీస్తున్న కుందాలపల్లి ఎంపీటీసీ పప్పుల సాయిబాబు

పి.గన్నవరం మండల సమావేశంలో
ఇసుక, మట్టి దుమారం

- సమస్యలపై గళమెత్తిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు
- ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన

పి.గన్నవరం, ఫిబ్రవరి 20: 'లంక పట్టాలు ఇచ్చింది మట్టి అమ్ముకోవడానికా... వ్యవసాయం చేసుకోవడానికా... మట్టి తవ్వితే ఆ పట్టాలు రద్దు చెయ్యండి... అధికారులు కుమ్మక్కై మట్టి, ఇసుక తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారు... సామాన్యుడు ఇసుక మూట తీసుకువస్తే కట్టడి చేసే మీరు ఇసుక, మట్టి తవ్వకాలను ఎందుకు పట్టించుకోరు... ఇళ్లు నిర్మించుకునే నిరుపేదల కష్టాలు మీకు కనపించట్లేదా... రాబోయే కాలంలో సంబంధిత అధికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదు...' అంటూ పి.గన్నవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు రెవెన్యూ అధికారులపై ధ్వజమెత్తారు.

ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన పి.గన్నవరం మండల పరిషత్ సమావేశంలో ఇసుక, మట్టి దుమారం రేగింది. సభ్యుల ప్రశ్నలకు స్పందించిన డిప్యూటీ తహసీల్దారు ర్యాంపులను పరిశీలిస్తామని చెప్పారు. శాఖలవారీగా జరిగిన సమీక్షలో గత నాలుగేళ్లుగా కాల్వలు అధ్వానంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదని ఎంపీటీసీ లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తూటు తొలగించేకాంట్రాక్టరు ఇప్పటి వరకు పత్తాలేడని... అయినా మీరు ఎందుకు పట్టించుకోవట్లేదని జేఈ సందర్‌సింగ్‌ను ప్రశ్నించారు. మండలంలో పలుచోట్ల పట్టాలు ఇచ్చినప్పటికీ స్థలం చూపించలేదని, విద్యుత్ లో ఓల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు, గృహ నిర్మాణ శాఖలో పనితీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉందని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వ్యాఖ్యానించారు. కాగా పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, డిప్యూటీ తహసీల్దారు బి.గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు పాల్గొన్నారు.

ఐదొందలు ఇస్తాను... అక్విడెక్టుపై గోతులు పూడ్చండి



గుడాల రామారావు, సర్పంచ్

నా వంతుగా 500 ఇస్తాను.... నేను కూడా 500 ఇస్తానుగోతులు పూడ్చండి అంటూ ఇద్దరు సర్పంచ్‌లు గుడాల రామారావు (వైసీపీ), పత్తిపాటి ఉమామహేశ్వరి (టీడీపీ)... ఒకరి తర్వాత ఒకరు అక్విడెక్టుపై గోతులు పూడ్చడానికి విరాళాలు ప్రకటించారు. వారి వ్యాఖ్యలు ప్రభుత్వ తీరు, నిధుల కొరత, అధికారుల అలసత్వాలను ప్రతిబింబించాయి. అక్విడెక్టుపై ప్రయాణం ప్రమాదంగా, నరకంగా ఉంది. కనీసం గోతులైనా పూడ్చండి అంటూ మొండెపులంక సర్పంచ్ గుడాల రామారావు ఇరిగేషన్ జేఈ సుందర్‌సింగ్‌ను కోరారు. ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదని ఆయన సమాధానం ఇచ్చారు.

నేను ఉత్సవ విగ్రహం అయితే...
మా గ్రామంలో ప్రభుత్వ భవనాలు దిష్టిబొమ్మలు

పత్తిపాటి ఉమామహేశ్వరి, సర్పంచ్


వైసీపీ అసమర్ధ పాలనకు మా గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిదర్శనం. నేను గ్రామానికి ఉత్సవ విగ్రహంలా ఎలా ఉన్నానో... మా గ్రామానికి ఆ భవనాలు దిష్టిబొమ్మల్లా వున్నాయి... మండల సమావేశాల్లో ఎన్ని సమస్యలను విన్నవించినా ఫలితం లేదు. మా గ్రామంలో ప్రధాన సమస్య పంచాయతీ కార్యదర్శి. మూడేళ్లుగా చాలా ఇబ్బంది పెడుతున్నాడు. నిధులు సమృద్ధిగా ఉన్న కనీసం స్లీపర్లకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. ఇన్‌చార్జి కార్యదర్శివచ్చినప్పటికీ బాధ్యతలు అప్పగించట్లేదు. చర్య తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పగా... పలువురు సభ్యులు కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. దీనికి ఎంపీడీవో ప్రతిస్పందిస్తూ... ఈ విషయమై ఈవోపీఆర్డీతో పరిశీలన చేయించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తర్వాతేంటి....



గొరగనమూడి డ్రెయిన్

పన్నెండేళ్లుగా ఆక్వా సాగు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. పంట ఏ స్థితిలో ఉన్నా తక్షణం ఖాళీ చెయ్యండంటూ వారం క్రితం అధికారులు చెరువుల వద్దకు వచ్చి హుకుం జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించాం. తర్వాత మా పరిస్థితి ఏమిటి? పోనీ ఎలాగో కష్టపడి తిరిగి వరి సాగు చేసుకుందామంటే చుట్టూ ఆక్వా చెరువులున్నాయి. వరి సాగు ఎలా సాధ్యం? వరి పండించాలంటే సరిహద్దు ఆక్వా చెరువులను మూయిస్తారా? లేదా మాకు కూడా ఆక్వాకు అనుమతిస్తారా... అని ప్రశ్నిస్తున్నారు సన్నవిల్లి సన్న, చిన్నకారు రైతులు. ఇదే ప్రశ్నలతో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.



గొరగనమూడి డ్రెయిన్‌ను ఆనుకుని సరిహద్దులో ఉన్న ఆక్వా చెరువు

మహాప్రభో!

- ప్రభుత్వానికి ఆక్వా రైతుల ప్రశ్న
- గొరగనమూడి ఆయకట్టులో ఆక్వా సాగు ఆపండి
- లేదా ఆక్వా సాగుకు మాకూ అనుమతి ఇవ్వండి: బాధిత రైతులు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 20: ఉప్పలగుప్తం మండలంలోని మైనర్ పంచాయతీ గ్రామమైన సన్నవిల్లిలో అందరూ సన్న, చిన్నకారు రైతులే. 2010 వరకు వరిసాగు చేసుకుంటూనే జీవించారు. ఆర్థిక ఉన్నతి కోసం 2011లో సుమారు 90 ఎకరాల్లో ఆక్వా సేద్యం మొదలెట్టారు. అధికారులు అడ్డు చెప్పలేదు. అడిగిన వెంటనే విద్యుత్ సరఫరా ఇచ్చేశారు. ఆక్వా సాగుతో నష్టపోతున్న వారికి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తూ, మిగిలిన గ్రామాల్లో మాదిరిగానే రైతులు ముందుకు సాగుతున్నారు. గ్రామంలో ఆక్వా సాగుతో కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందిపడుతున్నారంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. వారం క్రితం మత్స్య శాఖ అధికారులు వచ్చి సాగును నిలిపివెయ్యాలని హుకుం జారీ చేశారు. కౌంట్‌తో సంబంధం లేకుండా రైతులు చెరువులను ఖాళీ చేశారు. అసలు కథ ఇక్కడే ప్రారంభమైంది. ఇప్పుడా భూమిలో ఏమి పండించాలి? వ్యయప్రయాసలకోర్చి పంట పొలాలుగా మార్చుకుందామంటే సరిహద్దుల్లో అన్నీ ఆక్వా చెరువులే. వరి నాట్లకు వీలుండదు. వరి సాగు చెయ్యాలంటే డ్రెయిన్ ఆయకట్టు విస్తీర్ణంలో ఆక్వా సాగును నిషేధించాల్సిందే. వీలుకాని పక్షంలో సన్నవిల్లికి కూడా ఆక్వాకు అనుమతి ఇవ్వాల్సిందే. ఏదో ఒకటి తేల్చాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఆదిలోనే ఆక్వాను అనుమతించకపోతే ఇప్పుడు మాకు ఇన్ని కష్టాలు వచ్చేవి కాదంటూ అధికారులపై నిందలు వేస్తున్నారు. అప్పుడు అనుమతించిన మత్స్యశాఖ ఇప్పుడు వ్యతిరేకించడం ఎంతవరకు సబబని వ్యాఖ్యానిస్తున్నారు.

ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి

గనిశెట్టి గోవిందరాజులు, రైతు, సన్నవిల్లి



ఆక్వా సాగు నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నాం. దశాబ్దం దాటింది. ఇప్పుడు ఆక్వా సాగు నిలిపివేయించారు. సాగు కారణంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకుండా మొత్తం సాగునే అడ్డుకోవడం ఎంతవరకు న్యాయం. రికార్డుల్లో మా భూమి ఆక్వా చెరువుగానే నమోదయ్యింది. ఆ పద్ధతిలోనే ఏటా శిస్తు చెల్లిస్తున్నాం. సరిహద్దు గ్రామాల ఆక్వా సాగుకు లేని అడ్డంకి మాకు మాత్రమే ఎందుకు? అందరికీ ఒకే నిబంధన ఉండాలి.

సరిహద్దుల్లో ఆక్వా సాగు నిషేధిస్తే వరి పండించుకుంటాం: గనిశెట్టి వంశీ, రైతు



పదేళ్ల పైబడి ఉన్న చెరువులను ఇప్పుడు మూసివేయించారు. ఉన్న కొద్ది భూమితో కుటుంబం పోషించుకుంటున్న మా పరిస్థితి ఏమిటి? వరి సాగుకు సిద్ధంగా ఉన్నాం. సరిహద్దు చెరువులను మూయిస్తే వరి సాగు సాధ్యమవుతుంది. అలా కుదరకపోతే మాకూ ఆక్వాకు అనుమతి ఇవ్వాల్సిందే. అధికారులు ఏదో ఒకటి స్పష్టత ఇవ్వాలి. లేకుంటే అన్యాయమైపోతాం.



సన్నవిల్లిలో ఖాళీ చేసిన ఆక్వా చెరువు



జి.అగ్రహారంలో వ్యవసాయ శాఖ ఏవోను నిలదీస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

ప్రొటోకాల్ రగడ

- శిలాఫలకంపై మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పేరు వేయని వైనం
- ఆర్బీకే భవన ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న స్థానికులు
- భవనాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించకుండా వెళ్లిపోయిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



వివాదానికి కారణమైన శిలాఫలకం

అంబాజీపేట, ఫిబ్రవరి 20: రైతు భరోసా కేంద్రం భవన ప్రారంభోత్సవ శిలాఫలకంపై వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఆర్బీకే చైర్మన్ పేర్లు వేయకపోవడం ప్రొటోకాల్ రగడకు కారణమైంది. మండలంలోని గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంగళవారం వచ్చారు. శిలాఫలకంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, ఆర్బీకే చైర్మన్ రాయుడు చంటి పేర్లు వేయలేదు. దీంతో వైసీపీ శ్రేణులు ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నాయి. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అయిన తనకు కనీస విలువ లేదా అని శెట్టి, ఆయన వర్గీయులు అధికారులపై మండిపడ్డారు. శిలాఫలకంపై పేరు వేసే వరకు భవనాన్ని ప్రారంభించొద్దని స్థానికులు భీష్మించారు. దీంతో అధికారులపై తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, వైసీపీ శ్రేణులకు ఎమ్మెల్యే సర్దిచెప్పి భవనాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించకుండా వెళ్లిపోయారు. వెంటనే శిలాఫలాకాన్ని మార్చాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తొలుత గంగలకుర్రులో రూ.17లక్షలతో నిర్మించిన వెలనెస్ సెంటర్‌ను నిర్మించారు. అనంతరం కె.పెదపూడిలో సీఎస్ఆర్ నిధులు రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముక్కామలలో ఆర్బీకేను, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, బండారు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, నెల్లి పండు, నాయకులు విత్తనాల శేఖర్, బండారు మల్లి, నాగవరపు నాగరాజు, వాసంశెట్టి పెదబాబు, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో నేడు విమాన వేంకటేశ్వరస్వామి
విగ్రహ ప్రతిష్ఠ



ఆత్రేయపురం, ఫిబ్రవరి 20: కోనసీమ తిరుమల వాడపల్లిలో తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని సుమారు రూ.15లక్షల వ్యయంతో ఊబలంకకు చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి (ఎంఎస్ఆర్) కుమారుడు సిద్ధార్థరెడ్డి-అన్విత దంపతులు తయారు చేయించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవకలశారాధన, అంకురార్పణ, వాస్తు హోమంలను దాత దంపతులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. బుధవారం ఉదయం 10.10 గంటలకు సిద్ధార్థరెడ్డి దంపతులు విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,60,581 లభించినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.



వైభవంగా రథోత్సవం



భక్తజన సంద్రంగా అంతర్వేది

గోవింద నామస్మరణతో మార్మోగిన వీధులు

రథానికి తొలిపూజ చేసిన ఆలయ చైర్మన్

అంతర్వేది, ఫిబ్రవరి 20: గోవింద నామస్మరణలతో అంతర్వేది మార్మోగింది. పురవీధులు భక్తజన సమూహంతో నిండిపోయాయి. లక్షలాది మంది ముందు కదలగా శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2.46 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)కు చీర, సారె లాంఛనప్రాయంగా తీసుకువెళ్లారు. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కొబ్బరికాయలు కొట్టారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు సమయం పట్టింది. గోవింద, నరసింహ నామస్మరణలతో రథాన్ని భక్తులు లాగారు. భక్తులు రథానికి అరటి గెలలు, గుమ్మడికాయలు, వరి కంకులు కట్టారు. రథోత్సవం ప్రారంభంలో అధికార యంత్రాంగం అత్యుత్సాహం చూపించి సామాన్య భక్తులకు రథం తాడు లాగి దణ్ణం పెట్టుకునే అవకాశం కల్పించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగము దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీర ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వడుగు శ్రీను, తిరుమాని ఆచార్యులు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, కొపనాతి కృష్ణమ్మ కుటుంబీకులు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

భవనాలపై నిల్చుని రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు





రథోత్సవానికి హాజరైన కలెక్టర్, ఎస్పీ తదితరులు

భక్తుల పుణ్యస్నానాలు

భీష్మ ఏకాదశి సందర్భంగా వేలాదిగా భక్తులు సముద్ర స్నానాలు చేసి స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద క్యూలైన్‌లో సుమారు 500 మీటర్ల మేర బారులు తీరారు. క్యూలైన్‌లో కొద్దిసేపు భక్తులు కిక్కిరిసి కొంత సమయం అనంతరం స్వామిని దర్శనం చేసుకుని వెళ్లారు. స్వామివారి కల్యాణం తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించారు. అంతర్వేదిలో బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వర స్వామితో పాటు క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి, శ్రీవశిష్ఠ ఆశ్రమం, గుర్రాలక్కమ్మ ఆలయాల్లో వేలాదిగా భక్తులు పూజలు చేశారు.

అక్షింతల కోసం..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం తలంబ్రాలు బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కోసం వెళుతున్న భక్తులకు దర్శనం అనంతరం అక్షింతలు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలయ్యే దర్శన క్యూలైన్లలో భక్తులకు తలంబ్రాల అక్షింతలు పంపిణీ చేశారు.

నేటి కార్యక్రమాలు

బుధవారం సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన, రాత్రి 8 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకట సత్యనారాయణ, శ్రీహరిరావులచే నిర్మితమైన పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కమనీయం

ద్రాక్షారామ భీమేశ్వరుని దివ్య కల్యాణం



జీలకర్ర బెల్లం చూపిస్తున్న పండితులు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి వేణు, కలెక్టర్ హిమాన్షు

ద్రాక్షారామ,ఫిబ్రవరి 20: ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. మాఘ శుద్ధ ఏకాదశి ఆరుద్ర నక్షత్ర యుక్త తులా లగ్నమందు పుష్పాలంకృతమైన కల్యాణ వేదికపై మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో జరిగిన భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి పరిణయాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించారు. మూలవిరాట్టు శ్రీ భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లకు, క్షేత్ర పాలకులకు శ్రీలక్ష్మీ సమేత నారాయణస్వామి, శ్రీచండికా సమేత సూరేశ్వరస్వామికి ఏకకాలంలో జరిగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించారు. అంతకు ముందు నంది వాహనంపై నగరోత్సవం జరిగింది. అనంతరం కల్యాణ మూర్తులను అర్చకస్వాములు వేదమంత్ర పఠనం, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేదికపైకి తీసుకుని వచ్చారు.



కమనీయం.. కడు రమణీయం...

ఆలయ బ్రహ్మ దేవులపల్లి ఫణి రామకృష్ణ, వైదిక బృందం కల్యాణవేదికపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేసి కల్యాణం తంతు ప్రారంభించారు. సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ జరిపించారు. తదుపరి స్వామివార్లకు సువర్ణ యజ్ఞోపవీత ధారణ జరిగింది. రాత్రి 10.25 గంటలకు కల్యాణమూర్తులు స్వామివార్లు, అమ్మవార్ల శిరస్సున అర్చకస్వాములు జీలకర్ర బెల్లం ఉంచి కల్యాణం జరిపించారు. అనంతరం మాంగల్యధారణ జరిగింది. ఆహ్లాదంగా ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం జరిగింది. పునఃపూజ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించడంతో కల్యాణ మహోత్సవం తంతు ముగిసింది. భక్తులకు ముత్యాల తలంబ్రాలు స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు..పలువురు దాతలు భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

టీటీడీ సమర్పించిన పట్టు వస్త్రాలను మంత్రి చెల్లుబోయిన వేణు దంపతులు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పట్టు వస్త్రాలు అందించారు. స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలను సమర్పించింది. దేవదాయశాఖ ఇన్‌చార్జి ఆర్జేసీ ఎం.విజయరాజు, జిల్లా సహాయ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదారు రాపాక బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో పీటీవీ సత్యనారాయణ, వాడ్రేవు సుందరరత్నాకరరావు పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కంచర్ల చక్రి స్వామివారికి 504 కిలోల లడ్డూ సమర్పించారు. మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. గణపతిపూజ, మహాన్యాసం అనంతరం పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామిని అభిషేకించారు. లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు.

శాస్త్రోక్తంగా వధూవరుల అలంకరణ...

ఉదయం 6.15 గంటలకు భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను వధూవరులను చేశారు. శాస్త్రోక్తంగా ముత్తయిదువులు పసుపు దంచారు. అనంతరం కల్యాణ మూర్తులకు అర్చకస్వాములు మంగళస్నానం చేయించారు. వధూవరులుగా అలంకరించారు. స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 3.05 గంటలకు ముందుగా అంకురార్పణ, ధ్వజారోహణం జరిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని పుష్పాలంకరణతో ఆలయం శోభాయమానంగా మారింది. ఆలయం, కల్యాణవేదిక పుష్పాలంకరణ ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెద్దపులి అలజడి



చెరుకుమిల్లి శివారులో జాడలను పరిశీలిస్తున్న అధికారులు

దేవరపల్లి/గోపాలపురం, ఫిబ్రవరి 20: దేవరపల్లి మండలం బందపురం గ్రామశివారు పోలవరం కాల్వగట్టు వద్ద పొగాకు తోటల్లో పులి సంచరించినట్టు అడుగులను రైతులు, గ్రామస్తులు గుర్తించారు. అటవీశాఖాధికారులకు విషయం తెలియజేయడంతో రాజమండ్రి ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు టీమ్ బందపురం, పోలవరం గట్టు, పొగాకు, పామాయిల్ తోటల్లో పులిజాడలను గుర్తించారు. పులి సంచరిస్తుందని తెలియడంతో గ్రామస్థులు భయందోళనలో ఉన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు మాట్లాడుతూ పెద్దపులి ప్రస్తుతం దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పెద్దాపురం, చెరుకుమిల్లి, బందపురం, గ్రామాల మధ్య కుడికాల్వ ప్రాంతంలో ఉందని తెలిపారు. చిట్యాల, పెద్దాపురం, భీమోలు గ్రామాల ప్రజలను అటవీశాఖాధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రం పోలవరం మండలం వింజరం వద్ద ఉందని అంచనా వేయగా మంగళవారం ఉదయం దేవరపల్లి మండలం బందపురం గ్రామశివారు వచ్చి తిరుగుముఖం పట్టిందని ప్రస్తుతం పెద్దపులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని పోలవరం గట్టుపైన చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చామని తెలిపారు. పాపికొండల అభయారణ్యంలోకి పులి చేరవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం 5 దాటిన తర్వాత ఇంటికి పరిమితం కావాలని హెచ్చరికలు జారీ చేశారు. పొగాకు తోటల్లో ఆకురెల్చుకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే రెండురోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌టీఓ సాత్విక్, శ్రీను, పోలవరం రేంజ్ సిబ్బంది, వన్యప్రాణి సంరక్షక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పవన్ పర్యటన



అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

సమీక్ష తర్వాత మంగళగిరి పయనం

రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే : దుర్గేష్

రాజానగరం అసెంబ్లీ సీటుపై రాని స్పష్టత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం పర్యటన ముగిసింది. మంగళవారం ఏవీ అప్పారావు రోడ్డులోని గెయిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌చార్జులు, నాయకులతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పరిస్థితి, గెలుపు ఓటములపై పవన్‌కల్యాణ్ పార్టీ నాయకులతో చర్చించినట్టు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాలపై ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టి వీటిపైనే ఎక్కువగా చర్చించినట్టు సమాచారం. రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే పవన్‌కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఎవరిని పోటీలోకి దింపుతారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అయితే రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణకు టిక్కెట్ ఖరారు చేస్తారని అంతా భావించినా అలా జరగలేదు. నియోజకవర్గంలో పరిస్థితిని మాత్రమే పవన్‌కల్యాణ్ చర్చించినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణ కూడా స్పష్టంచేశారు. అయితే రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో టిక్కెట్ తనకే దక్కుతుందని భావిస్తున్నానని బలరామకృష్ణ చెబుతున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ ఖాయంగా కనిపిస్తోంది. నియోజకవర్గ పరిస్థితిపై పవన్‌కల్యాణ్‌తో సమావేశం తర్వాత కందుల దుర్గేష్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ టిక్కెట్ తనకు కన్‌ఫర్మ్ చేశారని స్పష్టం చేయడం గమనార్హం. ఇదిలాఉంటే, రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను రాజమహేంద్రవరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీష్‌మాధుర్ తదితరులు కలిశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ సుమారు గంటసేపు పవన్‌కల్యాణ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చారు. సమీక్షలు అనంతరం సాయంత్రం 4.30 గంటల సమయంలో పవన్ కల్యాణ్ బయలుదేరి వెళ్లారు. పవన్ కల్యాణ్ రాకతో జనసేన పార్టీ కార్యాలయం వద్దకు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

జీఎస్ఎల్‌లో ఏపీ మెడికోల క్రికెట్ టోర్నీ



రాజానగరం, ఫిబ్రవరి 20: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్ అండ్ డెంటల్ కళాశాలల పురుషుల క్రికెట్ క్రీడా పోటీలు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల నుంచి 42 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు ఆయన చెప్పారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 25 వరకూ ఐదు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. రానున్న రోజుల్లో రాత్రి సమయాల్లో సైతం క్రీడా పోటీలు నిర్వహించేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసే యోచన ఉన్నట్లు డాక్టర్ భాస్కరరావు ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ త్రిమూర్తులు మాట్లాడుతూ తొలిరోజైన మంగళవారం 16 జట్లు తలపడ్డాయన్నారు. దీనిలో భాగంగా మొదటి రోజు పోటీల్లో సిబార్ డెంటల్ కళాశాలపై సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల, నారాయణ డెంటల్ కళాశాలపై గుంటూరు మెడికల్ కళాశాల, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాలపై కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలపై కర్నూలు మెడికల్ కళాశాల గెలుపొందినట్టు త్రిమూర్తులు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తజనంతో రత్నగిరి కిటకిట



వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధి మంగళవారం అశేష భక్తజనంతో పోటెత్తింది సుమారు 7200 వ్రతాలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. సోమవారం రాత్రికే భక్తులు చేరుకోగా ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. రద్దీ నియంత్రణలో భాగంగా అంతరాలయ ప్రదక్షిణ టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు.

కులాల మధ్య ఐక్యతకు యువ నేతల కృషి అభినందనీయం

టీడీపీ యువ నేతలతో పవన్‌కల్యాణ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'కులాలను కలిపే ఆలోచనా విధానమనే మా సిద్ధం కోనసీమలో కార్యరూపంలోకి వచ్చింది. కులాల ఐక్యతకు కృషి చేస్తున్న యువనేతలందరికీ అభి నందనలు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజ మహేంద్రవరంలో మంగళవారం టీడీపీ నేతలు ఆదిరెడ్డి వాసు, గంటి హరీష్, వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, యర్రంశెట్టి కాశీ, మండెల బాబీ తదితరులు పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'ఐక్యత ఒక్కరోజులో రాదు. ఇవాళ అందరూ ఒకతాటి మీదకు రావడం ఒక మార్పును సూచిస్తోంది' అని అన్నారు. కోనసీమలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. వైసీపీ కుట్ర ఫలిస్తే రావణకాష్టం అయ్యేదన్నారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని తాను గతంలో రాజమహేంద్రవరంలోనే చెప్పానని, అన్ని వర్గాలను కలుపుకుని సోదరభావంతో ముందుకు వెళితే అది కచ్చితంగా గొప్ప సంకేతమవుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కులాల ఐక్యత ప్రభావం కనిపిస్తుందని ఆయన చెప్పారు. సమావేశంలో పిఠాపురం ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 20: ధవళేశ్వరంలో జనార్ధనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు జయజయ జనార్ధన అంటూ రథాన్ని లాగారు. మంగళవారం మధ్యాహ్నం కొండపై నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకిపై తీసుకువచ్చి రథంపై ఆసీనులు చేశారు. అనంతరం రథం ముందు కుంభం పోసి నైవేద్యంగా సమర్పించారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు. రథం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. రాత్రికి కొండపై స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు దర్శించి పూజలు నిర్వహించారు. వివిధ సంస్థల, సంఘాల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్, పలువురు ఎస్ఐలు 100 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

సాహస పోలీస్‌కు సత్కారం



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమంటే కృతజ్ఞతలను సైతం కోరుకోకుండా ప్రతిక్షణం ప్రజల రక్షణ కోసమే పాటుపడే గొప్ప అవకాశమున్న ఉద్యోగమని ఎస్పీ జగదీశ్ అన్నారు. సమయస్ఫూర్తితో ఏడుగురి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన సాయుధ రిజర్వు విభాగం కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావును మంగళవారం ఆయన సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. సోమవారం కోనసీమ జిల్లాలోని బెల్లంపూడి సెంటర్ వద్ద కారు అదుపు తప్పి బైక్‌ని ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లింది. కానిస్టేబుల్ శ్రీనివాసరావు తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరగడంతో కాల్వలోకి దూకి పీకలలోతు నీటిలోంచి ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) పి.అనీల్‌కుమార్, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించాలంటూ ఉద్యోగుల నిరసన

రావులపాలెం, ఫిబ్రవరి 20: తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం భోజన విరామ సమయంలోమండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. పీఆర్ ఇంజనీర్లపై వేధింపులు మానుకోవాలన్నారు. పెండింగు వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కొత్త జిల్లాకు కొత్త పోస్టులు నియమించి పనిభారం, ఒత్తిడి తగ్గించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు.

డ్వాక్రా రుణాల మంజూరుకు కమీషన్లు

- యానిమేటర్‌కు నిధులు ఇవ్వడంపై ఆగ్రహం
- వాడివేడిగా అల్లవరం మండల సమావేశం

అల్లవరం, ఫిబ్రవరి 20: డ్వాక్రా రుణాల మంజూరులో యానిమేటర్లు 10శాతం కమీషను తీసుకుంటున్నారని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజం... డ్వాక్రా నిధులు స్వాహా చేయడంతో సస్పెండ్ చేసిన గూడాల యానిమేటర్‌ను తిరిగి విధుల్లోకి ఎలాతీసుకున్నారని అధికారులపై సర్పంచ్ మండిపాటు...నీటిఎద్దడి, ఇతర సమస్యలపై సభ్యుల ఆగ్రహం... వెరసి అల్లవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు అధ్యక్షతన మంళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. డ్వాక్రా రుణాలకు యానిమేటర్లు లక్షకు రూ.1,000 వంతున లంచాలు తీససుకుంటున్నారని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మితో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆరోపించారు. గుండెపూడిలో యానిమేటర్ నిధులు స్వాహా చేసినా పట్టించుకోలేదని ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి ఆరోపించారు. గుడాల యానిమేటర్ గోసంగి వెంకటరమణ రూ.5.45లక్షలు స్వాహా చేయగా డీపీఎం, ఏపీఎంలు విచారణచేసి సస్పెండ్ చేశారన్నారు. ఆమెను విధుల్లోకి ఎందుకు తీసుకున్నారని ఏపీఎం సయ్యద్‌పై సర్పంచ్ దాకారపు చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలు దోచేసిన ఆమెను విధుల్లోకి తీసుకుంటే అందోళన కొనసాగిస్తానని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఏపీఎంను హెచ్చరించారు. ఆయనకు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు మద్దతు తెలపగా యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీ కోరారు. ఆ యానిమేటర్ విషయంలో తనను బెదిరిస్తున్నారని, ఇంకా రూ.3.44 లక్షలు బకాయి ఇంకా ఉందని ఏపీఎం సయ్యద్ వివరించారు. కొమరగిరిపట్నం జాంబవన్‌పేట స్కూలును చర్చిలో నడుపుతున్నారని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ఆరోపించారు. కోడూరుపాడు సీతారామపేటలో అద్దెఇంట్లో పాఠశాల నడుపుతున్నారని ఎంపీటీసీ రంగానాథస్వామి అన్నారు. మొగళ్ళమూరు మెయిన్‌రోడ్డులోని పాఠశాలను విద్యార్థులు లేక మూసివేశామని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. గుండెపూడి వాటర్ ప్రాజెక్టు గట్టు దిగజారి ఇబ్బందిగా మారినందున ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు శ్రద్ధచూపాలని ఎంపీపీ సూచించారు. తుమ్మలపల్లి శివారు తాళ్ళచెరువులో కుళాయి నీటిలో పురుగులు వస్తున్నాయని ఎంపీటీసీ పి.రాజేశ్వరి ఆరోపించారు. గూడాల, తాడికోన, యెంట్రుకోన పంట కాలువలకు సాగునీరు అందట్లేదని సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, దాకారపు చిరంజీవి, తిక్కిరెడ్డి శ్రీనివాసులు ఆరోపించారు. మండలంలోని పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏఎంసీ ఛైర్మన్ దంగేటి జోలామణి, ఎంపీడీవో కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, ఏఈ జి.స్వామి, రెహమాన్, కె.సునీత, ఎన్వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి కట్టిన సొమ్ములు ఏమయ్యాయి..!

- కట్టిన సొమ్ములకు రశీదులు లేవని పొదుపు సొమ్ము నుంచి జమ

అంబాజీపేట, ఫిబ్రవరి 20: కుటుంబ అవసరాల కోసం తీసుకున్న సొమ్ము కొంతమొత్తంలో చెల్లించినప్పటికీ బ్యాంకు రశీదులు పూర్తిస్థాయిలో లేవని తమ పొదుపు సొమ్ము నుండి లక్షలరూపాయలు తీసుకోవడంపై అంబాజీపేట మండలం కె.పెదపూడికి చెందిన అశ్విని డ్వాక్రా సంఘ సభ్యులు మండిపడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. అశ్విని గ్రూపునకు చెందిన ఐదుగురు మహిళలు స్త్రీనిధి ద్వారా రూ. 2,50,000 సొమ్మును తీసుకున్నారు. ఈ సొమ్మును సంఘ సభ్యురాలైన పులిదిండి రూస్సీ, ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సొమ్మును దాదాపు రూ. 1,81,500 వరకూ చెల్లించారు. అయినప్పటికీ బ్యాంకు రశీదులు లేవని ఆ గ్రూపు సభ్యుల పొదుపు ద్వారా రూ.1,44,000 తమకు తెలియకుండా అధికారులు తీసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్త్రీనిధి సొమ్మును రూపాయి వడ్డీకి ఇస్తామని చెప్పి ఇప్పుడు అధిక మొత్తంలో సొమ్ములు రికవరీ చేస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని సంఘ సభ్యులు పులిదిండి మంగాదేవి, నెల్లి పద్మలు కోరుతున్నారు.

అహంకారంతో విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును తొలగించారు

- మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం, ఫిబ్రవరి 20: అహంకార పూరితంగా విదేశీ విద్య పథకానికి డాక్టర్ బీఆర్ అంబేకర్ పేరును తొలగించారని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం గుడిమెళ్లంకలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాపాక నవరత్నం ఇంటి వద్ద జరిగిన దళిత నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించి భారతదేశ దశ, దిశను మార్చిన మహనుభావుడు అంబేద్కర్ అని, అటువంటి గొప్ప వ్యక్తి పేరును విదేశీ విద్య పథకానికి తొలగించడం జగన్మోహన్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమని అన్నారు. జూపూడి ప్రభాకరరావు తన మాటల్లో అంబేడ్కర్ పేరును తొలగించి జగన్మోహన్‌రెడ్డి పేరు పెట్టడం తప్పుకాదని సమర్థించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో దోనిపాటి రాజు, రాపాక ఆనంద్‌కుమార్, రాపాక సత్యనారాయణ, కట్టా వెంకటరమణ, నాగిరెడ్డి గోపి, పితాని నాగరాజు, ముత్యాల శ్రీనివాస్, తాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన జూపూడి

విశ్వేశ్వరాయపురంలో జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో దళితుల ఆత్మ గౌరవాన్ని జగన్ కాళ్లదగ్గర తాకట్టు పెట్టిన జూపూడి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో జిల్లెల్లె బాబ్జీప్రసాద్, కారుపల్లి ఏసురత్నం, తాడి సత్యనారాయణ, ఉండ్రాజవరపు బాబూరావు, పమ్మి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దళిత నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

గోవిందు, నామాని వెంకటేశ్వరరావు, పితాని శ్రీనివాస్, రమణాతి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్ని వ్యవస్థలు నిర్వీర్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 20 : వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్నివ్యవస్థలు నిర్వీర్యంగా మారాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని వాకతిప్ప, నాగులచెరువు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట పర్యటించిన ఆయనకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచె ప్రసన్నకుమార్, అల్లూరి రామకృష్ణచౌదరి, మాజీ ఎంపీటీసీ కడలి

స్థానికులకే టీడీపీ టిక్కెట్ కేటాయించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 20: పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ అభ్యర్థిత్వాన్ని స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గ ఎస్సీ సెల్ సమావేశం తీర్మానించింది. నగరం గ్రామంలో ఎస్సీసెల్ సమావేశం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జాలెం సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే స్థానిక నాయకులకు టిక్కెట్టు కేటాయిస్తే విజయం సునాయాసమవుతుందన్నారు. పి.గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్న గుమ్మడి వెంకటేశ్వరరావు పనితీరు బాగాలేదన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా టీడీపీకి సీనియర్ నాయకులుగా ఉన్న జాలెం సుబ్బారావుకు అధ్యక్ష పదవి కేటాయించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు బొంతు ఏడుకొండలు, ఉండ్రాజవరపు ప్రభుదాస్, జాలెం రమణకుమారి, పెదపూడి శ్రీనివాస్, మోర్త వెంకటేశ్వరరావు, గోగి రమేష్, నక్కా సత్యనారాయణ, నేదునూరి వెంకటరమణబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్చిని పరిశీలించిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

ఆత్రేయపురం, ఫిబ్రవరి 20: మండలంలోని వద్దిపర్రు రేవులో బేతస్థ ప్రార్థన మందిరాన్ని ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ మంగళవారం పరిశీలించింది. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. డాగ్ సంఘటనా స్థలం నుంచి కొంతదూరం వెళ్లింది. పోలీసు యంత్రాంగం ఆధారాల సేకరణలో నిమగ్నమైంది. కాగా చర్చిని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారి అనుచరులతో కలిసి చూశారు. పాస్టర్ దాసరి మోషేను పరామర్శించి తమవంతు ఆర్థిక సాయం అందించారు. చర్చి దగ్ధానికి పాల్పడిన దుండగులపై కఠినచర్యలు చేపట్టాలని వివిధ క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి.

రోడ్ల అభివృద్ధికి వినతి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20: కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్‌గడ్కరీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఢిల్లీలో కలిశారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసిన మంత్రి విశ్వరూప్

కల్యాణమస్తు.. షాదీతోఫా కింద రూ.3.80 కోట్ల లబ్ధి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20: పేదల పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు వారి వివాహాలను జరిపించే సామాజిక బాధ్యత కింద వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తూ అండగా నిలుస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరులోపు వివాహం చేసుకున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడ బిడ్డలకు ఆర్థికసాయం అందించారు. జిల్లాలో 492మంది వధువులు రూ.3.80కోట్ల లబ్ధి పొందినట్టు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ వివరించారు. చెక్కును డీఆర్వో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, ఏపీడీ ఎంఎం జిలానీ, జడ్పీటీసీలు గెద్దం సంపదరావు, పందిరి శ్రీహరి, శామ్యూల్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20: 'జగనన్న పాలవెల్లువ' అమలుకు జిల్లాలో పాల సేకరణ కేంద్రాల నిర్వహణకు బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఇన్‌చార్జి పోస్టుల భర్తీకి గురువారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.18వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఉంటుంది. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, డెయిరీ సైన్స్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఐదు బీఎంసీయు కెమిస్ట్ పోస్టుల భర్తీకి బీఎస్సీ కెమిస్ట్రీ అర్హత ఉండాలి. ఎనిమిది క్షేత్రస్థాయి సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి బీఎస్సీ అగ్రికల్చర్, డెయిరీ, ఫుడ్ టెక్నాలజీ అర్హత అవసరం. ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఐటీఐ ఎలక్ట్రికల్, రిఫ్రిజిరేషన్ కోర్సులు పూర్తి చేసి ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలతో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కేంద్రంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరు కావాలి.

ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు నిలుపుదల

ఆత్రేయపురం, ఫిబ్రవరి 20: కోనసీమ జిల్లాలోని వివిధ రీచ్‌ల్లో అక్రమ ఇసుక, బొండు మట్టి తవ్వకాలను మంగళవారం నిలుపుదల చేశారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లలో అనధికార అక్రమ, ఇసుక మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న తీరుపై జిల్లా ఇసుక కమిటీపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై ఆంధ్రజ్యోతితోపాటు పలు పత్రికల్లో కథనాలు రావడంతో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని గోపాలపురం, ఊబలంక, జొన్నాడ ఇసుక రీచ్‌లతోపాటు అనధికారకంగా నిర్వహిస్తున్న రీచ్‌ల్లో ఇసుక, బొండుమట్టి తవ్వకాలను అక్రమార్కులు నిలిపివేశారు. ఎక్స్‌కవేటర్లు, యంత్రాలను రహస్య ప్రాంతాలకు తరలించి రీచ్‌ల నుంచి అందరినీ పంపేశారు. ఎన్‌జీటీ అధికారుల బృందం రీచ్‌లను పరిశీలించే అవకాశం ఉందనే సమాచారంతో ర్యాంపుల్లో తవ్వకాలు నిలుపుదల చేసినట్టు తెలిసింది. దీనిపై రెవెన్యూ, సెబ్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరే ప్రయత్నం చేయగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

కనుమరుగవుతున్న వృత్తుల పునరుజ్జీవనానికి..

పీఎం విశ్వకర్మయోజన పథకం: డీఆర్వో వెంకటేశ్వర్లు

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న చేతి, కులవృత్తులను పునరుజ్జీవింపచేసేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారి ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సౌజన్యంతో మంగళవారం పీఎం విశ్వకర్మ యోజన అవగాహన సదస్సును కులవృత్తులు చేసుకునేవారు, డ్వాక్రా సంఘాల సభ్యులతో నిర్వహించారు. కామన్ సర్వీసు సెంటర్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. డీపీవో వి.కృష్ణకుమారి, లీడ్ బ్యాంకు మేనేజరు కె.శ్యామ్‌బాబు, మున్సిపల్ కమిషనరు ఎస్.మనోహర్, ఎంఎస్ఎంఈ డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి, సహాయ సంచాలకుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ఐ.పోలవరం, ఫిబ్రవరి 20: మహాశివరాత్రి సందర్భంగా మార్చి 12వ తేదీన వృద్ధగౌతమి నదివద్ద జరిగే తెప్పోత్సవ ఏర్పాట్లను మంగళవారం ఆలయ ఛైర్మన్ పెన్మెత్స వాసురాజు, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, సర్పంచ్ కాలే రాజబాబు పరిశీలించారు. మార్చి 8 నుంచి ఐదు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఆఖరి రోజున అమ్మవారిని, స్వామివారిని హంస వాహనంపై గోదావరిలో తెప్పోత్సవ మహోత్సవం నిర్వహిస్తారు. పుష్కర్‌ఘాట్ స్థలాన్ని, సాంస్కృతిక, పూజాకార్యక్రమాలు జరిగే ప్రదేశాలను పరిశీలించి, కార్యక్రమాలకు సంసిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొలిశెట్టి గంగబాబు, పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు తదితరులున్నారు.

ఘనంగా రుద్రహోమం

మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం, ఆరుద్ర నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రుద్రహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

శివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 20: గొల్లవిల్లిలోని శ్రీమాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద వచ్చేనెల 6 నుంచి 11వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం గ్రామ యువత ఆధ్వర్యంలో పందిరిరాట వేసి శివరాత్రి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 6వ తేదీ రాత్రి మాణిక్యాంబాభీమేశ్వరుల దివ్య కల్యాణం జరుగుతుందని ఉత్సవకమిటీ తెలిపింది. మహా శివరాత్రిరోజున చీకట్లపాలేనికి చెందిన పోలిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఉంటుంది. అదేరోజు రాత్రి గత ఏడాది టెన్త్ మెరిట్ విద్యార్థులకు భీమేశ్వరస్వామి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తారు. ఉత్సవాల్లో భరతనాట్యం, లలిత సంగీతం, కోలాటం వంటి సంప్రదాయ కళలకు స్థానం కల్పించినట్టు కమిటీ సభ్యులు వివరించారు.

వైభవంగా విశ్వేశ్వరుడి కల్యాణం

అంబాజీపేట, ఫిబ్రవరి 20: మాచవరం శివారు కోశివారి అగ్రహారంలోఉన్న శ్రీ భువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దూళ్ళపాళ్ళ ప్రవీణ్‌శర్మ, రాణి ప్రవీణ్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దివ్యకళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంవద్ద అన్నసమారాధ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. 25న స్వామివారి పుష్పోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాన సత్రాల్లో ప్రసాదాల వితరణ

అంతర్వేది, ఫిబ్రవరి 20: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పదిరోజులపాటు స్వామివారి నిత్యాన్నదానం నిలిపివేయడంతో గ్రామపురవీధుల్లో వివిధ సామాజిక వర్గాలకు చెందినవారు అన్నదాన సత్రాలవారు నిర్వహిస్తున్నారు. దానికనుగుణంగా స్వామివారి కల్యాణోత్సవాల్లో ఆయా సంఘాల సత్రాలవారు పూర్తిస్థాయిలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. భక్తులకు ఎక్కడా రాజీపడకుండా రాత్రింభవళ్ల సత్రాల్లో ప్రసాదం అందించడం విశేషంగా చెప్పుకోవచ్చు. చిరంజీవి సేవాసమితి, ఉలిశెట్టి లక్ష్మణరావు ఆధ్వర్యంలోను, గొంది గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నదాన సత్రంలో భక్తులకు ప్రసాదం అందించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, వలవల రాంబాబు, ఉండపల్లి అంజి, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 20 : మండలంలోని అంగరలో ఉన్న శ్రీఅలివేలు మంగ, గోదాదేవి సమేత శ్రీ వైభవ వెంకటేశ్వస్వామి వారి నవమ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం విశ్వక్సేన ఆరాధన, యాగశాల అర్చన, ధ్వజారోహణ, లక్ష్మీనరసింహ సహిత మహాసుదర్శనహోమం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలను చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీకరి శ్రీనివాస పవన్‌కుమార్ ఆచార్యస్వామి బ్రహ్మత్వంలో నిర్వహించారు. రాత్రి స్వామివారి వార్షిక కల్యాణమహోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పి.గన్నవరం, ఫిబ్రవరి 20: ఉడిమూడి గ్రామంలో ఉన్న చిన్న అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ తీర్థమహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఐదురోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవాలకు ఉత్సవకమిటీ, ఆలయ ప్రధాన అర్చకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లావారు జామున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించగా స్వామివారి దర్శనానికి సమీప గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు బారులు తీరారు. అనంతరం తీర్థము, మధ్యాహ్నం గ్రామసేవ నిర్వహించారు. రాత్రి స్వామివారి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ గావించి కళ్యాణం జరిపించారు.

లోకేశ్‌ను కలిసిన కాదా వెంకటరమణ



లోకేశ్‌తో సత్యా స్కాన్ అధినేత కాదా వెంకటరమణ

రామచంద్రపురం, ఫిబ్రవరి 20: కాకినాడ సత్యా స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఇటీవల కలిసినట్లు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం, కాకినాడరూరల్ అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకచోట తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని వెంకటరమణ లోకేశ్‌ను కోరినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేనపార్టీ ప్రభజనం ఖాయమని అధికారంలోకి వచ్చాకే పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం దక్కుతుందని లోకేశ్ సూచించినట్లు వెంకటరమణ తెలిపారు.

నియోజకవర్గ టీడీపీ యువత అధ్యక్షుడిగా ఉండమట్ల

మండపేట, ఫిబ్రవరి 20: మండపేట నియోజకవర్గ టీడీపీ యువత అధ్యక్షుడిగా కేశవరంనకు చెందిన ఉండ మట్ల సురేష్, మండపేట పట్టణ తెలుగు యువత అధ్యక్షుడి గా వేగుళ్ల తేజ, రాయవరం మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ఎం.దుర్గారావులు నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల అభినందించారు.

బోడసకుర్రును ఓఎన్‌జీసీ దత్తత తీసుకోవాలి

- నిరసన వ్యక్తం చేసిన సర్పంచ్, గ్రామస్థులు

అల్లవరం, ఫిబ్రవరి 20: కేజీ బేసిన్ పరిధిలోని అల్లవరం మండలం బోడసకుర్రులో 30 ఏళ్లుగా చమురు, సహజ వాయువు ఉత్పత్తులు తరలిస్తున్న ఓఎన్జీసీ తమ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలంటూ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్లాంటు గేటు ఎదుట నినాదాలు చేశారు. సీఎస్ఆర్ నిధులతో లింక్ రోడ్ల అభివృద్ధిపై ఓఎన్జీసీ ఉన్నతాధికారి ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, చింతా శ్రీనివాస్, ముత్యాల బాబి, రేళ్ళ అంజిబాబు, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి భావన, మల్లిపూడి నవీన్, మోసుగంటి దుర్గారావు, ఎన్.శ్రీను తదితరులు నిరసన తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



అంబాజీపేట, ఫిబ్రవరి 20: ఉపాధి పనులు చేస్తున్న సమయంలో ఓ కూలి గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందింది. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం అరిగెలవారిపాలెంలో మంగళవారం గోసంగి వెంకటరత్నమ్మ(67) ఉపాధి పనులుచేస్తున్న సమయంలో ఒక్కసారిగా కళ్లు తిరుగుతున్నాయని కుప్పకూలింది. దీంతో అక్కడఉన్న తోటి కూలీలు ఆమెకు సపర్యలుచేసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. ఏపీవో బి.చంద్రమోహన్, క్షేత్రసహాయకుడు వి.శ్రీనివాస్, స్థానిక నాయకులు మృతదేహాన్ని పరిశీలించారు.మృతురాలికి ముగ్గురుకుమార్తెలు,ఇరువురు కుమారులు ఉన్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఐ.పోలవరం, ఫిబ్రవరి 20: నిజాన్ని నిర్భయంగా వెలికితీస్తున్న జర్నలిస్టులపై అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడటం సిగ్గుచేటని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఎద్దేవా చేశారు. మురమళ్ళలో చెయ్యేటి శ్రీను అధ్యక్షతన మంగళవారం టీడీపీ ఎస్సీ సెల్ సమావేశం జరిగింది. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై అధికారపార్టీ నాయకులు దాడిచేసి గాయపరచడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ఎం.భైరవమూర్తి, పండురాజు, మిమ్మితి చిరంజీవి, జొన్నాడ రాజారావు, తాతపూడి నాగేశ్వరరావు, వీధి లోవరాజు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

అయినవిల్లి, ఫిబ్రవరి 20: అనంతపురంజిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దుర్మార్గపు చర్య అని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు మంగళవారం ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అత్యంత బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, కొత్త శ్రీరామచంద్రమూర్తి, పసలపూడి శ్రీనివాస్, రాజేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వారణాసి సూర్యనారాయణ వర్ధంతి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 20: బీజేపీకి మూలమైన జనసంఘ్ ఆవిర్భావం నుంచీ పనిచేసిన వారణాసి సూర్యనారాయణ వర్ధంతిని మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీని ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేసిన ఆయన రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారన్నారు. కోనసీమ రైల్వే లైన్ నిర్మాణానికి సూర్యనారాయణ కుమారుడు రాంమాధవ్ చేసిన కృషిని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, ఆర్టీఐ సెల్ కన్వీనర్ అరిగెల తేజ, జిల్లా ఉపాధ్యక్షురాలు జగతా శాంతి, డేగల వెంకటరామన్ నివాళులర్పించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 20: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ భవన నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని సమకూర్చిన పీఏఎస్ సుబ్బరాజు, పీటీవీ వర్మ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి, ఎంపీపీ కోలా గంగాభవానీ, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ, పీటీవీ వర్మ, జగతా బాబ్జీ, సర్పంచ్‌లు పొత్తూరి ఉమారాణి, విత్తనాల వీరనాగబ్రహ్మేశ్వరరావు, ఎంపీటీసీలు గిరిగి దుర్గవీరకుమారి, పొత్తూరి వీణారాణి, మండల ఇంజనీరింగ్ అధికారి పాలకొల్లు శ్రీనివాసరావుల తోపాటు పలువురు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

మామిడికుదురు, ఫిబ్రవరి 20: ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ ఖాదిర్ పేర్కొన్నారు. మామిడికుదురులో ఎంపీ నిధులు రూ.5లక్షల తో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులకు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ మంగళవారం శంకుస్థాపన చేస్తారు. జిల్లాలో కొత్తపేట, అంబాజీపేట, తాండవపల్లి శ్మశానవాటికలకు రూ.5లక్షల చొప్పున అల్లవరం శ్మశానవాటికకు రూ.3లక్షలు నిధులు మంజూరు చేశారని ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సజ్జాద్ హుస్సేన్, ఎండీవై షరీఫ్, కార్యదర్శి జాఫర్ హుస్సేన్, కోఆప్షన్ సభ్యుడు నూరేన్‌అబ్బాస్, అన్వర్ తాహిర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

గోడ నిర్మాణానికి శంకుస్థాపన

అల్లవరం, ఫిబ్రవరి 20: అల్లవరం శ్మశానవాటిక వద్ద ఎంపీ నిధులు రూ.3 లక్షలతో గోడ నిర్మాణానికి వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ అబ్దుల్ ఖాదర్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బొమ్ము బాలవేణి, దాసం రాంబాబు, చికిలే చిట్టిబాబు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు ఎండీ షరీఫ్, షేక్ రెహ్మాన్, షేక్ వలీ, రబ్బానీ, హుస్సేన్, దాహేర్ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించిన డీవైఈవో

రాయవరం, ఫిబ్రవరి 20: మండలంలోని పసలపూడి, వెంటూరు గ్రామాల్లో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం రామచంద్రపురం డీవైఈవో ఎస్ఎల్ నరసింహ ఫణి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వస్తున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని విద్యార్థులకు సులభతరమైన బోధన అందించేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నూలు ఆదినారాయణ, సత్తిరాజు, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ఆర్పీలు విల్లూరి వీరభద్రావు, పీవీకే బాపూజీ, లచ్చిరెడ్డి వెంకటరమణ, వై.విజయకుమార్, సీఆర్పీలు వి.సీతా ధనలక్ష్మి, పోసిరాములు, వీర్రాజు, సీనాసిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశిని మండలంలోని ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజామునుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని యండగండిలోని రామాలయంలో ఏకాహం నిర్వహిచారు.సత్యవాడ, ఊడిమూడిలోని రామాలయాల్లో సప్తాహాలు ఏర్పాటుచేశారు.

రాయవరం: మండలంలోని వాడవాడలా భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 12 గ్రామాల్లో రామాలయాలు, వైష్ణవాలయాల్లో అష్టోత్తర నామాలతో పూజలు జరిపిన అనంతరం రోజంతా ఏకాహ భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

యానాం పిల్లరాయ క్లబ్‌కు నాలుగు అవార్డులు

యానాం, ఫిబ్రవరి 20: లయన్స్ క్లబ్ యానాం పిల్లరాయకు వివిధ విభాగాలలో నాలుగు అవార్డులు కైవసం చేసుకుంది. ఇటీవల నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలుగాను ఈ పురస్కారాలు అమలాపురంలో జరిగిన సమావేశంలో అందజేశారు. వీటిలో కంటిచూపుకు సంబంధించి కార్యక్రమాల నిర్వహణకుగాను మొదటి బహుమతి, ప్రజలకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహించినందుకుగాను ద్వితీయ బహుమతి, క్లబ్ ప్రోత్సాహక బహుమతితోపాటు మోస్ట్ ఆక్టివ్ ప్రెసిడెంట్ అవార్డును పొందినట్లు క్లబ్ ప్రతినిధులు పులవర్తి శ్రీను, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, చిక్కాల నరసింహమూర్తి, చెక్కల అరుణ్‌కుమార్ తెలిపారు.

జగనన్న లేఅవుట్ బాధితుల రిలే నిరాహార దీక్ష

అయినవిల్లి, ఫిబ్రవరి 20: పోతుకుర్రులో జగనన్న లేఅవుట్‌లో మట్టి పనిచేసిన ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కాంట్రాక్టరు వైసీపీ నాయకుడు కావడంతో వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరగకపోతే ఆమరణ దీక్ష చేపడతామని బాధితులు పేర్కొంటున్నారు.

వలంటీర్లకు పురస్కారాలు అందజేత

రామచంద్రపురం, ఫిబ్రవరి 20: స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో మంగళవారం గ్రామ వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట, ఫిబ్రవరి 20: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం కాగా రూ.1.50లక్షలు ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన గుబ్బల రామకృష్ణకు చెందిన తాటాకింట్లో శ్రీకాకుళంకు చెందిన కొబ్బరి దింపు కార్మికులు అద్దెకు ఉంటున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరగగా రామకృష్ణకు చెందిన గృహోపకరణ వస్తువులు, వంట సామగ్రి, దింపు కార్మికుల వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో తోమాల సేవకు రూ.1.20లక్షల విరాళం

ఆలమూరు, ఫిబ్రవరి 20: మండలంలోని చింతలూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తోమాల సేవకు పువ్వుల ఖర్చు నిమిత్తం ఆలమూరుకు చెందిన రైస్‌మిల్లు అధినేత వట్టికూటి సతీష్‌బాబు దంపతులు రూ.1.20 లక్షలు విరాళం అందించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 20: ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం పితాని వీరవెంకట సత్యనారాయణ ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ముమ్మిడివరం కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి'

కాట్రేనికోన, ఫిబ్రవరి 20: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచుస్తంభం సోనీ మంగళవారం విజయవాడలో సెలెక్షన్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు. ఆది నుంచి పార్టీకి సేవలందిస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని పీసీసీ నాయకులు హామీ ఇచ్చినట్టు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సుపరిపాలన సాధ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 20: ప్రజలకు సుపరిపాలన కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో మంగళవారం ఇంటింటా కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో బ్రోచర్లను అందించారు. షర్మిళ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు. కార్యక్రమంలో ముషిణి శివప్రసాద్, వడ్డి నాగేశ్వరరావు, పి.ఉదయభాస్కరవర్మ, రెడ్డి బాబు, దేవరపల్లి రాజేంద్రబాబు, ఎన్.నాగేశ్వరరావు, ఎన్.రామకృష్ణ, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో ఆరోగ్య సురక్షా శిబిరం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 20: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని మంగళవారం చల్లపల్లి జడ్పీ హైస్కూల్లో నిర్వహించడం చర్చనీయాంశమైంది. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో శిబిరం నిర్వహణపై తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఎస్.యానాం పీహెచ్‌సీ వైద్యాధికారి లోవసుధ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిదిగంటలకే ప్రారంభమైన శిబిరానికి వైద్య నిపుణులు ఆలస్యంగా రావడంతో రోగులు అసహనానికి గురయ్యారు. పీహెచ్‌సీల్లో అందే సేవలు, మందులే తప్ప సురక్ష శిబిరాల్లో ప్రత్యేకత ఏమీ లేదని రోగులు అసంతృప్తి వ్యక్తం చేయడం కొసమెరుపు.

ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం

మండపేట, ఫిబ్రవరి 20: మండలంలోని జెడ్.మేడపాడులో ఉన్న శ్రీషిర్డి సాయిబాబావారి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో బాబావారికి బిష్మఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ప్రముఖ అధ్యాత్మికవేత్త నండూరి నాగబాబుదంపతులను గ్రామస్థులతో పాటు ఆలయ నిర్వాహక ట్రస్టుసభ్యులు సత్కరించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైసీపీ యువనేత తోట పృథ్విరాజ్, జెడ్.మేడపాడు సర్పంచ్ చంద్రశేఖర్, వీఆర్‌వో రామచంద్రరావు,ట్రస్టుసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం

మండపేట, ఫిబ్రవరి 20: మండలంలోని మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైన్స్ డేను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.టీ.టీ.వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఢిల్లీకి చెందిన నేషనల్ ఫిజికల్ లేబరేటరీ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ భగవన్‌నారాయణ హాజరై సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.